# బైరాగి మామ

"మామా! రెండ్రూపాలుంటే యీవు? మళ్ల తీరుస్తలే" అప్పి దీనంగా చూస్తూ బుర్ర గోక్కుంటూ అడిగింది.

బైరాగి మామ నులకమంచం అల్లుతున్నాడు. శీతాకాలం యెండ పొద్దున తొమ్మిదింటికే చురుక్కు మంటున్నది. తలెత్తి అప్పినోసారి చూసి, మామ మళ్లొ నులక అల్లసాగాడు. మంచి డిజైను అల్లుతున్నాడు.

"యేం జేస్తా రెండ్రూపాయల్తో? మీ అయ్యకు తాగబోస్తావా? వాడి సంపాదనతో వాడు తాగలేడూ?"

నింద నిశితంగా లేకపోయినా అప్పి కళ్లు తడి అయినై. తల వంచుకుని చేతులూ గోళ్ళూ చూసుకుంటూ నిలబడిపోయింది బాగా మాసిన అంచులు చిరిగిన పరికిణీ, చింపిరి తలా, వాడిన ముఖం కొత్తగా పొటమరిస్తున్న యవ్వనం, దాని ఆకారం మామను కదిలించివేసింది.

"ఇస్తా లే చెప్పు యేం చేస్తా?"

ఆశగా తలెత్తింది అప్పి, "నాన్రోజులాయె వణ్ణం చూసి. టీనీలు తాగి రొట్టెలనీ, అమ్మా తమ్ములూ యియాల పనికెల్లలేక యింటికాడే వుండిపోయారు. ఒక కిలో బియ్యం తెచ్చిస్తా, ఈ పూట అన్నం తింటారు. రాత్రికి గంజినీల్లూ," అన్నది.

"రెండు రూపాయలేగా మీ యజమానురాలు అప్పీయదూ?" నులక అల్లికలు చూసుకుంటూ అడిగాడు.

"పనిపోయి యెన్నాళ్లైపోయే మామా! మల్ల పనిదొరకనే లేదు." మళ్లా తలొంచుకున్నది. తలెత్తి యెటో చూసింది. మామను చూసింది.

బైరాగి మామ ఆశ్చర్యపోయాడు. నవ్వుతూనే అడిగాడు నువ్వు మానేసావా? వాళ్లు తీసేసారా?

"మానీమన్నారు. మానీశాను."

నులక అల్లికలో నిమగ్నుడైన మామ కూపీలాగాడు.

"యెందుకు మానేమన్నారు? యేదన్నా పోయిందా? శాన్నాళ్లైగనామంబెట్టావా? యెదురుతిరిగిదెబ్బలాటేసుకున్నావా?

అప్పి జవాబీయలేదు. నాల్గువేపులా చూసింది. పైత్య పెండకు నించోలేక నేలమీద కూలబడింది. మామ పక్కగా చూసాడు. అప్పి కడుపు వెన్నుకంటుకుపోయి కనిపించింది. మట్టి కెలుకుతున్నది. చేతులు చూసుకుంటున్నది.

అల్లటం ముగిసింది. మామ కొబ్బరితాడు కోసం ఇంట్లో కెళ్ళి, తెచ్చి కాళ్ల కాడ బిగిస్తున్నాడు.

'పోనీగానీ రెండూ్రిపాయలిస్తాననుకో యెన్నాళ్లొస్తాయీ మల్లపనికెళ్ళపూ?' రెండు రూపాయల నోటందించాడు.

"అందరిల్లల్లో పిల్లలు కుదిరి సేస్తన్నారు. తెలిసినోళ్ళ నడిగాను. యాడా కాళీలేదన్నారు. నువు పనిచూపిస్తావని వచ్చా అడగలేక పోయినాను."

అప్పి తరికిణి దులుపుకులేచింది. నోటు చూశాక మొహం నవ్వు మొహమైంది. ఆశతో మామను చూసింది. మామకు జాలేసింది.

"నీకు నామీద గురిలేదై పాయె. నిదానంగ పని చేయాల నిలకడగా చేయాల. నిజాయితీగా పనిచేస్తావుంటే జీతం హెచ్చిస్తారంటే వినవై పాయె." కాళ్ళకాడ బిగిస్తున్నాడు. ఒకటే ఆబ. ఒకటే తొందర. అత్యాశ." మళ్లా లోపలకెళ్లాడు. రెండు రొట్టెలు తెచ్చి అప్పికిచ్చాడు.

"పని నువే చూసుకో, అప్పు తీర్చేయి. పోబోయాడు. అప్పి జుట్టు వెనక్కునెట్టుకుంటూ అడిగింది. రొట్టెల మీద చొక్కా కప్పి, పొట్లాంనించుకున్నది.

"పని చూపించవా?"

నీకు నా మీద గురిలేదు. విసిగించకు.

"అట్లంటె యెట్లా మామా! ఈమాటినుకుంటా. కిందటిసారి పొరపాటయిపోనాది. శానయిబ్బందిగున్నాది. వూర్నిండ అప్పు లెక్కువై నాయి. పైసా కంట సూసి యెన్నాళ్లైనాదో తలకు నూని రాచి రెణ్ణెలై నాది. సూడుమామా! మొక్కజొన్న పీచులాగా అయినాది"

ఆశ పీడించగా, వెళ్ళిపోలేక చాలాసేపక్కడే నిలబడి బతిమాలి, పని చూపిస్తానన్న తరువాతే కదిలింది అప్పి.

బైరాగి మామ భార్య ప్రమాదంలో పోయింది. కొడుకు

వడ్రంగి మిత్రులతో కలసి సౌదీ అరేబియా వెళ్ళాడు. తిరిగి రాలేదు. కూతురుకి పెళ్లి సంబంధం చూస్తున్నాడు మామ. సినిమాలో చేరాలనే పిచ్చితో, చెప్పుడు మాటలు నమ్మి యిద్దరు చెలికత్తెలతో, చెప్పకుండా వెళ్ళిపోయింది. మరి రాలేదు.

బైరాగి తల్లి ముసలిది. చూపు ఆనదు. బైరాగి తండ్రి పోర్టులో కూలీపని చేసేవాడు పోయినాడు. బైరాగికితోబుట్టువులు లేరు.

బైరాగి దారిద్ర్యం యెరగడు. అతనికి పని దొరకని రోజు లేదు చిన్న పిల్లలకి చదువు నేర్పటం దగ్గర్నుంచి, వూడ్పులకీ, కలుపు తీయటానికీ, నాట్లకీ వ్యవసాయపనులలోకి వెళ్తాడు నామోషిలేదు పొద్దు బోతుందని రోజుకూలీకీ వెళ్తాడు వళ్ళు దాచుకోడు పనే దేవుడు అంటాడు నవ్వుతూ డబ్బు యెందుకు నిలవజేయలేక పోయినాడంటే, యితరుల యిబ్బందులు చూడలేక ఆదుకుం టాడు. తన యిబ్బందులు తనవి కావనుకుంటాడు.

తల్లిని కనిపెట్టుకుని వున్నాడు. పాటుబడేది తల్లి కోసమే. అతనికావుళ్లో వరపతి వున్నది. అతని మాటకు విలువ ఉన్నది. నిదానస్తుడని పేరుబడ్డాడు. అవమానాన్ని లెక్కచేయడు. పని నెరవేరటం ముఖ్యం,

కుర్రకారు అతన్ని ఎంప్లాయిమెంట్ ఎక్చేంజి ఆఫీసరని పిలుస్తారు. ట్యూషను చూపుతాడు. చెప్పించుకొనే పిల్లల్ని చూపుతాడు, చెప్పించగల దల్లిదండ్రులనీ చూపుతాడు. ఉద్యో గం కావాలంటే యెవర్ని పట్టుకోవాలో, యేం చేయాలో చెపు

తాడు, కోళ్ళ ఫారం నడపడం, తేనెటీగల పెంపకం నేర్పుతాడు యోగాభ్యాసం, కుస్తీ, కర్రసాము నేర్పుతాడు.

బైరాగి మళ్లా స్త్రీని తెచ్చుకోలేదు. పదాలు తత్వాలు పాడతాడు. భజన కూటమి నడుపుతాడు. అపూరి కూలి జనం, జీతగాళ్లు, పాలేరులు అతన్ని "మామా అని పిలుస్తారు.

బాంకులో వేసుకున్నట్టు తమ డబ్బు అతనివద్ద దాచు కుంటారు. అప్పుయిప్పిస్తాడు,

అప్పి యేడుస్తూ వుబ్బిపోయిన మొహంతో వచ్చింది, మాటాడక యెక్కిళ్ళు పెడుతూ నించుంది.

"యేమైందే మళ్లా వచ్చావు? నా న్నల్లు కడుపు నిండా కూడుపడేప్పటికి, చేతిలో పైసమిగిలే సరికి, వళ్లుబరువెక్కిందా?"

'నానేం చెయ్యలేదు మామా. అల్లే మానేయ మన్నారు. ఇంగెట్లా? మాయమ్మ కన్నాది. యెవురూలేరు. అయ్యకు కాళ్ళ వాపు. పచ్చవాతం అన్నాడు వైదుగుడు. లెగలేడు దగ్గూ, ఆయాసం వస్తుండాయి' బావురుమన్నది.

"వూరుకో, వూరుకో యేం జరిగిందో చెప్పు. యేమైనా యెత్తుకొచ్చావా?"

యెక్కిళ్లు బెడుతూనే తల అడ్డంగా ఆడించింది. మాట పెగిలి రాలేదు. యెగబీలుస్తున్నది.

పొద్దూక వస్తున్నది. దిక్కులకు జేగురు రంగు అలుము కున్నది. చీకట్లు ముంచుకొస్తున్నాయి" పిట్టలుఅరుస్తూగూళ్ళకు చేరుతున్నాయి.

"యెట్లా మామా! రేపిటాల్నించి కూడెట్టా?"

మామ తల్లిచేత అన్నం తినిపించాడు. వాకిట్లో మంచం మీద చేర్చాడు. కుక్క కావలా. ఇంటికి తాళం పెట్టాడు.

"పోదాం పద యెందుకు మానేయమన్నారో చెప్పపైతివి వారినే అడుగుదాం పద."

తువాలు బుజాన వేసుకుని మామ ముందు నడుస్తుంటే అప్పి అనుసరించింది. ఇద్దరూ అడ్వోకేటు గారింటికి చేరారు. పక్కవాకిలి గుండా వెనకవేపు వెళ్ళారు. వంటింటి ముందు తులసికోట.యజమానురాలు తులసిముందుదీపముంచుతున్నది. ఇద్దరూ నిలబడ్డారు. ఆమె తులసికి ప్రదక్షిణలు చేసి వీరిద్దరినీ గమనించింది.

"యేం బైరాగీ! యిలా వచ్చావూ? దాన్నే అడక్క పోయావూ? తీసేశారని చెప్పిందా?

"బైరాగి ముందు నమస్కార బాణం వేశాడు. తర్వాత సమ్మోహనాస్త్రం వంటి చిరునవ్వూ.

"తమకు తెలియనిదేమున్నదీ? నోటీసివ్వకుండా తీసేస్తే నోటిముందు కూడు లాగేసినట్టే. ఇద్దరు మనుషుల అన్నం మీరు వేస్తే, ముగ్గురు దాన్ని పంచుకు తిని పస్తోకి వెళ్తున్నారు. పిల్ల

తప్పు చేస్తే చెప్పండి. పని యెగేస్తే జీతం విరగ్గోయండి. యెదురు చెపితే దెబ్బ వేయండి. ఇవన్నీ ముందే ఒప్పుదలగా చెప్పుకున్నాను. యెంత సేపడిగినా యెందుకు మానేయమన్నారో అది చెప్పటం లేదు." వొంగి దోసిలి పట్టాడు. యజమానురాలు యేమని చెప్పేదో గానీ వీధి వాకిట బైరాగినీ పిల్లనూ చూసిన పిల్లలు దొడ్లోకి పరిగెత్తుకొచ్చారు. చేతులూ కళ్ళూ తిప్పుతూ వళ్ళంతాకదిలించుకుంటూ, నలుగురుపిల్లలూ నాలుగు కంప్లెయింట్స్ చెప్పారు.

"యేచిన్నపని చెప్పినా, చెయ్యదు యెదురు చెపుతుంది"

"బజారు పని చిన్నది చెప్పినా, అందులోనే కమీషన్ కొడుతుంది."

'నెలకు కనీసం యాభై రూపాయలన్నా, కాజేస్తుంది.'

"అమ్మ దానికి కావల్సినవన్నీయిస్తున్నా,అప్పు అడిగితే యిస్తున్నా, మేము వేరే జీతమివ్వాలనీ లేకపోతే మేమేమి చెప్పినా తాను చేయలేనని దబాయించింది."

"మీరు నాకు జీతమిస్తున్నారా? అని కళ్ళు వురుముతూ మీదకొస్తుంది. మేమే తీసేయమన్నాం తీసేయక పోతే మేమే తన్ని తగిలేస్తామన్నాము."

బైరాగి మామ పిల్లల యాక్షన్ సూసీ, మాటలు వినీ నవ్వేశాడు. గడ్డంగోక్కున్నాడు. మెడగోక్కున్నాడు. నవ్వుతూ అడిగాడు.

'యిఫయిరూపాయలే మిగుల్చుకున్నదా బాబూ? అట్లైతే యీ చింకి గుడ్డలూ, చెప్పులైనాలేకుండా యెండనక, వాననక అంతదూరం నించి రావటమెందుకు? అంత పెద్ద బజారు వనే వుంటే డబ్బులెక్కచూపాలి అనుకుందాము. ఒక వదిరూపాయలు జీతం పెంచికే సంతోషించదా? మీరు వెళ్ళక్కరలేదు. అయ్య గారి గుమాస్తాకు వని చెప్పక్కరలేదు. అలా చేస్తే అన్యాయం జరుగుతుందంటారా? యేమైనా బాబూ! ఒక నెల జీతమిచ్చి, ఒకనెల ముందు చెప్పి తీసేయాలి అమ్మగారితో అలా ఒప్పందం చేసుకున్నాము. మర్లా పని వెతుక్కుని కుదురుకోవాలి." నవ్వుతున్నాడు. 'వది, వదిహేను కాజేసిందనుకున్నాము. చూడండి బాబూ! యాభై కాజేయనీయలేదనియేడుస్తున్నదా? లేక కూడూ గుడ్డా పోయి తల్లి దండ్రుల చేతతిట్లూ దెబ్బలు తినలేక యేడుస్తున్నదా? యేమంటారు నవ్వు ముఖం.

ఆ రీజనింగుకి సమాధానం చెప్పలేక పిల్లలు గలగలా నవ్వి పారిపోయారు. యజమానురాలు తల వంకించింది. పిల లు వెళ్ళిన వేపు చూసింది. అప్పినీ, భైరాగినీ చూసింది. దీపం ఆమె కళ్ళల్లో ప్రతిఫలించింది. ఆదరంగా నవ్వింది.

'తీసేయలేదు భైరాగీ! పిల్లలు గదా! యేదో బెదిరించారు నువ్వు చెప్పినట్టు పది రూపాయలు హెచ్చిస్తాలే. అప్పి! పని మరీ యెక్కువగా వున్నదా? అప్పి కళ్లు తడిసినై. తల అడ్డంగా తిప్పిందీ,

"పిల్లలు గదా "తీసేస్యాం పో" అని గదమాయించారు. నిజమనుకున్నది." అంటూ లోపలికెళ్ళింది మళ్ళీ వచ్చి పది నోటు అప్పికి అందించింది.

అప్పి తీసుకుని మామవంక చూసింది.

"రేపటి నుంచి వేళకి వచ్చి బుద్ధిగా పనిచేసుకో, యెదురాడకు" మామ అప్పిని వెంటబెట్టుకెళ్ళాడు.

రెండేళ్ళ వరకూ అప్పి అప్పాగావాలనిగానీ పని చూపించమనిగానీ బైరాగిని చూడరాలేదు.

ఒకసారి పోలిపిల్లమ్మ తిరణాలలో కాన వచ్చింది. వంటి మీద నకిలీ నగలూ, తలలో పువ్వులూ, మిసమిసలాడే యవ్వనంతో, వొయ్యారాలు ఒలికిస్తూ, చెలికత్తెలతో సరసాలాడుతూ, బైరాగిని గమనించనట్టు వెళ్ళిపోయింది.

మాట నిలబెట్టుకున్నదిగాబోలు, బాగుపడిందనుకున్నాడు బైరాగి.

తల్లికి కామెర్ల వ్యాధి వచ్చింది. పెద్దది కావటంవల్ల నయం కాకపోగా ముదరసాగింది. దాంతో తనపనీ, యింటిపనీ, వంటపనీ, తల్లి సేవ వీటన్నిటితో మునగానాం, తేలానాం అయినాడు మామ, పనైనా చూపించమని పిల్లలు వచ్చి అడిగితే, వినుక్కొక, కసురుకోక చూపిస్తూనె వున్నాడు, కూలిపనైనా సరే.

ఆనాడు తల్లికి వాంతులై, హైరానైంది. రాత్రి యేడున్నరయింది, దీపం వెలుగుతున్నది. తల్లి మంచం పక్కన కూచుని వున్నాడు బైరాగి. కునుకు బట్టింది. లేచి చూస్తే పది కావస్తున్నది. తల్లి నిద్రబోతున్నది. తలుపు చప్పుడైంది. వెళ్ళి తీశాడు. యెదురుగా అప్పి. వీది గుమ్మం వెలుగులో అప్పి చీర కొంగు వేలికి చుట్టుకుంటూ నిలబడింది.

"యేమే! ఇంత రాత్రేల వచ్చినావు? పొద్దున్నె రాలేక పోయినావూ?" అన్నాడు.

"పొద్దున్నెట్లా వచ్చేది మామా! అదెట్టా తీర్చుకునేది తెల్దు మామా. మా అమ్మకూ, అయ్యకూ తెలిస్తే యింకేటున్నది? గెంటేస్తురు. నీవే తీర్చాలి." బొంగురు గొంతూ తడబడే మాటలూ, బెదురు కళ్ళూ, దాని అవస్త చెపుతున్నాయి.

"అవతలికి పా ముందు. అమ్మకిప్పుడే నిద్రబట్టింది" తలుపు దగ్గరగా లాగి, అప్పిని దూరంగా తీసికెళ్ళి చెట్టు కింద కూచోబెట్టి వివరాలడిగాడు.

"పాక నేయించాలనీ, యింటి పన్ను అనీ, మందులకనీ శానా కర్సయినాది మామా. ఇన్నాలనుంచీ నమ్మకంగా పని సేస్తన్నావు. ఒక్కంద రూపాయలు అమ్మగార్నడిగి అప్పు తేలేవా? అన్నది మాయమ్మ".

"అంటే చేతివాటం చూపించావా? నీ బుద్ధి బుగ్గయిందా?"

"సెప్పేది యినిపించుకోవేం మామా! డబ్బందిస్తే సంతోసంగా తీసుకుంటాదిగానీ, అదెట్లొచ్చినాదో తెలుసుకోదు మాయమ్మ". అని ఆగింది.

"యేంజేశావింతకూ?"

"అప్పడిగితే అమ్మగారు అప్పు యియ్యలేదు. వదో, పాతికో యిస్తారుగానీ వంద యిస్తారా? జీతం సెల్లుకాద్దై పాయె. అది తీరుస్తుండగానే మల్లీ పదే, పదేనూ, యిరవై అప్పు

తెమ్మంటాది మాయమ్మ. ఇచ్చినా, పనెక్కువై మాటలంటే పడాల. నోరెత్తనీదు, పని సేయలేకపోతున్నాను, ఒల్లంత నొప్పులే. నిద్ర లేదు. వాంతులౌతున్నాయి" సన్నగా యేడుపందుకున్నది అప్పి.

"యేమంటావింతకూ? అప్పు కావాలా? నా దగ్గర మాత్రమెక్కడున్నదీ వందా? అమ్మకు పసిగర్లయి మూడు నెలలయినాది. నాకు పనేదీ? అమ్మనెవరు చూస్తారూ? పన్లోకెళ్ళలేదు".

"అయ్యో మామా! యింకెట్ట సెప్పేదీ? ఇయాలిట్లున్నావేం?" కొంగు ముఖానికి అడ్డం పెట్టుకున్నది.

బైరాగికి అర్థమైంది.

"మంగమ్మను సూడకపోయావా? నేనేటి సేయగల్ను. ఊరుకో. లెగు ముందు. కూచో. యేడుపాపు. అందరూ పోగై యేటని నిగ్గదీస్తారు". బైరాగికి జాలివేసింది. కాళ్ళకు చుట్టుకున్న అప్పి వీపుమీద రాచాడు. లేవదీశాడు.

అప్పి పమిట దిద్దుకుని కళ్ళు తుడుచుకున్నది.

"చూసినాను. పనేమీ కాలేదు. పెమాదమంటాది. డబ్బియాలి. యాడిది మామా! అది లేకనే గదూ యిన్ని యిబ్బందులూ కట్టాలూ. ఈ నకిలీ నగలన్నీ అమ్మినా పాతిక రాలవు. యేమీ దారే లేదా? సావాల్సిందేనా మామా?" మొహం రెండు చేతులతో కప్పుకున్నది.

బైరాగి విషాదంగా నవ్వాడు. సాలోచనగా చూశాడు. వోదార్చాడు. "పిచ్చి పిల్లా! పిచ్చి పిల్ల. నే చెప్పినట్టు అచ్చ రాలా వింటావా? మరి మాటమీద నిలబడాలి".

చేతులు తీసింది. ఆశతో దాని కళ్ళు మెరిసినై.

"యింటా మామా. యింటాను. బుద్ధొచ్చింది. నీకు తెలీకుండా యెల్లాను. డబ్బు సూసి వొల్లు మరిసినాను. సులభంగ అందుతున్నాదని బెమపడ్డాను. ఈ పాలి మాట తప్పితే, నలుగురెదుటా, నీ కాలి సెప్పుతో ముకం పగలగొట్టు. 'యెందుకు యేమి తప్పు చేసినా'నని గూడా అడగను." మళ్ళా మామ పాదాలు పట్టుకున్నది.

## 4

వేరే వూళ్ళో పనిలో పెట్టి వచ్చాడు అప్పిని. అన్నం, బట్టా, ఒక గదీ యిస్తారు. వంటా, యింటి పనీ చేయాలి.

"జీతం నాకే పంపండి. ఇంటికాడ దాని మనుషులు దానిమీద ఆధారపడిపున్నారు. వారి కందిస్తానమ్మగారూ". అని వొప్పించాడు. డెలివరీ అయేదాకా పొంతపూరు రావద్దని చెప్పాడు అప్పికి.

"యేం భయం లేదు. ఇబ్బందీ లేదు బైరాగీ. ధర్మాసుపత్రిలో చేర్పిస్తా" అన్నది డాక్టరమ్మ.

"వొళ్ళొంచి పని చేస్తుందమ్మగారూ! యేదో చిన్నతనం."

"నా దగ్గరే వుంటుంది. నువ్వు నిశ్చింతగా వెళ్ళచ్చు".

బైరాగి వచ్చేశాడు. అప్పి తల్లి వచ్చి,

"అప్పి జీతం పంపారా డాక్టరమ్మ? ఇటియ్యి. జరుగు బాటు లేదు" అని డబ్బు పట్టుకుపోతుంది.

అప్పు కావాలని వేధించిందా, "అప్పి క్లీనర్‌పని మానేసి వచ్చేస్తుందీ. నీ యిష్టం, నీ కూతురిష్టం. నేనింక కలగజేసు కోను. అది టెంపొరరీ వుద్యోగమే" అంటాడు.

అడ్వకేట్‌గారి భార్యకి మరో మంచి అమ్మాయిని పని చేసి పెట్టేందుకు కుదిర్చాడు.

"అప్పి యేమైందీ? చెప్పకుండా మానేసిందేం?" యజ మానురాలడిగింది.

"దాని తండ్రి తాగి వూరినిండా అప్పులు చేశాడు. అప్పు తెమ్మనీ అప్పిని సతాయిస్తుంటే, వేరే వూళ్ళో పనిలో పెట్టి వచ్చానమ్మగారూ. అప్పు తీరగానే వచ్చేస్తుంది. మీకాడే చేస్తుంది" అన్నాడు.

"నాకు తెలుసులే" అన్నట్టు నవ్విందావిడ. చిరునవ్వే జవాబు.

బైరాగి తల్లి పసిగర్లు ముదిరిపోయింది. డెబ్బైయేళ్ళ కాయకష్టం మీదే బతికింది. దినాలు బాగా చేసి కుల పెద్దలను మెప్పించాడు.

"తల్లి ఋణం తీర్చాడు" అన్నారు.

ఒంటరివాడైనాడు. తల్లిలేని లోటు పీడించింది. ఆ యింట్లో, ఆ వూళ్ళో వుండలేక, బంధుగులనుండమని పక్క వూరు వెళ్ళాడు.

బైరాగికి మేస్త్రీలతో దోస్తీ కుదిరింది. మేడలు లేస్తున్నాయి. కూలీలను అదిలిస్తూ పని చేయిస్తాడు. మేస్త్రీ మరో బిల్డింగ్‌వేపు వెళ్ళినా, పని సాగిపోతుంది.

బైరాగి మేస్త్రీ అయినాడు. కూలీ రేటు పెరిగింది. మేస్త్రీ కంట్రాక్టరయినాడు. బైరాగిని పోనీయలేదు. నికరాదాయం వస్తున్నది. డబ్బు యిబ్బంది లేదు. స్వంత వూరు వెళ్లాడు. పాక కూలిపోతుంటే, తీయించేసి చిన్న యిల్లు కట్టించి, అద్దెకిచ్చాడు.

అప్పిని గురించి వూరివాళ్లు వింతగా చెప్పారు. తల్లి దగ్గరికి వచ్చేసిందట. అప్పి అప్పలమ్మ అయిందట, అప్పులిస్తుందట, నగలు తాకట్టు పెట్టుకుని అప్పుయిచ్చి, వడ్డీ కడుతుందిట. తాత చెప్పాడు.

"అనకాపల్లిలోనో, యలమంచిలిలోనో పనిలోచేర్చి వచ్చావుసూడూ. అడే రేతిరేల చదువుచెప్పే బడికి పంపిందిట డాక్టరమ్మ. సదువనూ, వ్రాయనూ, లెక్క, డొక్క, రాతాకోతా నేర్పిందట. అల్ల అయ్య పోయినప్పుడు అమ్మ కబురెడితే వచ్చేసింది. మరింక అల్లమ్మ యెల్లనీయలేదు 'సంపాయించింది

చాలు' అన్నదట. బానేవున్నారు. పెంకుటిల్లే యించింది. ఆవూ గేదే కొన్నది. సొంతబిజినెసు పెట్టుకోమని గవర్నమెంట్ అప్పు యిచ్చినారట. పాన్‌షావూ, టీస్టాలూ యెట్టింది. అంతా నీ చలవ బైరాగీ.''

బైరాగి తలూపుతూ విన్నాడు. గడ్డంలో గోళ్ళు దూర్చి గీకుతూ, నిశ్చలంగా నిర్వికారంగా చూసాడు.

## 5

బైరాగి స్వంతవూరు బాగా విస్తరించింది. అభివృద్ధి చెందింది. రోడ్లూ, దీపాలు, నిప్పుపెట్టెలంటి యిల్లూ వచ్చాయి. నాగరికత వచ్చిందని చెపుతూ, సినిమాహాలూ, గ్రంథాలయం పార్కు, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీసూ, ధర్మాసుపత్రి వెలిశాయి. పార్క్‌లో రేడియో పెట్టారు. యెత్తుగా చిన్న టివి అమర్చారు. గ్రామీణుల కార్యక్రమం, వార్తలూ, ధరలూ, వాతావరణం సంగీతం అందాయి గ్రామీణులకి.

బైరాగిని లైబ్రెరియన్‌గా వేశారు. పక్కనె చిన్న క్వార్టర్సు యిచ్చారు. స్వంత వూళ్ళోస్థిరపడ్డాడు. ఇల్లు అద్దెకే వదిలాడు ఆదాయం చూసి పిల్ల నిస్తామని వచ్చారు. కులస్థులు చేసుకోమన్నారు.

'వయసై పోయినాది చేసుకోను.' అని పంపేశాడు. ప్రతి శుక్రవారం సంతకెళ్ళి సరుకులూ, కూరలు తెచ్చుకుంటాడు సంతలో అప్పలమ్మ తారసపడింది, మామను పలకరించలేదు. ముప్పైయేళ్లు నిండినై వళ్ళు చేసింది. బైరాగి పలకరించలేదు.

రిక్షాలో వెళ్తూ ప్రమాదానికి గురై, నడుం విరిగిన తల్లిని కని పెట్టి వున్నది. తోడ బుట్టిన వాళ్ళను బడికి పంపింది. పెళ్ళిళ్ళు చేసిందని విన్నాడు. సంతోషించాడు.

బైరాగి యిప్పుడూ పిల్లలకి పన్లు చూపిస్తున్నాడు. ఆ వూరి కుర్రకారు 'మామను సన్మానించి, ధీనబంధు' అనె బిరుదు నిచ్చారు. బైరాగి విందు చేశాడు.

ఆ రోజు పొద్దున్నె దిన పత్రిక తిరగేయగానె పక్కవూరి పరిస్థితి విపులంగా పడిందందులో. నాలుగు రోజుల క్రితం ఆ వూరి మీద బందిపోటు దాడి జరిగింది. ఆనాడాదివారం బైరాగి పట్నం వెళ్ళాడు. వూరివాళ్ళే చేతికందిన చేపాటి కర్ర, గొడ్డలీ, రాగోలా, గునపం, పలుగూ, దోకుల బారా, బరిశాలాంటివి అందుకుని బందిపోటులను యెదుర్కొన్నారు. స్త్రీలనూ, వృద్ధులనూ, పిల్లా మేకా, గొడ్డూ గోదా, కోడీ, కుక్కా, పంటా కాపాడుకున్నారు. ఆ చిన్న సైజు పోరాటంలో యిరు నాగులవారూ గాయపడ్డారు. వైద్యమందక యిద్దరు పోయారు. గాయపడినవారిలో బందిపోటూ వున్నాడు. వూరి పెద్దకాపు కొడుకూ వున్నాడు. అంతా అయాక పెద్ద రంతు అయిందని, పోలీసు బలగం వచ్చింది. కొందరిని అరెస్టు చేశారు. అరె స్టయినవారి పేర్లలో అప్పలమ్మ పేరు చదివాడు బైరాగి.

పైకది బందిపోటు దాడిలాగా కనబడినా, పోలీసుల కధన ప్రకారం, వూరిలోని రెండు ముఠాలు కొట్టుకున్నాయి. పాత పగలు తీర్చుకుంటూ యిళ్ళు గూడా ముట్టించారు. కొంతమంది గడుసుపిండాలు దొంగల్లాగా వేషం వేసి, నగదు,

వెండి బంగారాలూ కొట్టేశారు. ఇళ్ళు ఆర్పాలని ఫోన్‌చేసి, సైకిళ్ళ మీద వెళ్ళీ చెప్పేటకుంటే అరగంటకి ఫైరింజన్ వచ్చి మంటలనదుపులోకి తెచ్చింది. అంతా ఆర్పటానికి గంట పట్టింది. మరునాడు మొండి గోడలూ, కట్టుగుడ్డలూ, పసి బిడ్డలతో తమ యిళ్ళ ముందు నిలబడ్డారు. కొంతమంది యేమైనా మిగిలాయేమోనని బూడిద కెలుకుతున్నారు.

కలక్టరుగారితో మొత్తుకుంటే, మనిషి ఒక్కింటికీ ఐదు వందలు రొఖ్ఖం శాంక్షను చేశారు. నిరుపేదలు పాకలు కప్పు కోవాలి. అగ్నిమాపకదళంవారు సగం కాలిన సామానూ బొంగులూ కుప్పలు పెట్టి, స్థలం శుభ్రం చేసి వెళ్ళిపోయారు. ఆ కాస్త డబ్బుతో వారి జీవితాలూ, స్థావరాలూ పూర్వ స్థితికి వస్తాయా? తన హెచ్ యమ్ టీ వాచీ మంటల్లో పోయిందని ఆటో రిక్షావాలా యేడుస్తున్నాడు. చొక్కా జేబులో పుండి పోయిందిట. చొక్కా మెడుకున్నదిట. వారంతా కూడదీసు కోవాలి. దయగల ఆసాములు, అగ్నిబాధితులకి తమకు తోచిన సహాయం, గుడ్డల రూపంలోగానీ, రొఖ్ఖం గానీ, బియ్యమూ కూరలూ యీయాలి.

బైరాగి తన్మయత్వంతో చదువుతున్నాడు. దినపత్రిక ఫట్రున లాగివేయబడింది. "ఈనాడు" పైకిలేచి గాలికెగిరి దూరానబడింది.

బైరాగి బండెడు ఆశ్చర్యంతో లేచి నిలబడిపోయాడు. అతని చెవులలో ఆర్తనాదాలు గింగురుమంటూ వినిపిస్తున్నాయి.

పిల్లా, పాపా, ముసిలీ ముతకా తప్పించమని యేడుస్తూ కళ్ళకు గట్టారు. పశువులూ పక్షులూ, గగ్గోలుపడుతూ తప్పించుకోవాలని చూస్తూ కనబడ్డాయి.

యెదురుగా హెడ్ కాన్‌స్టేబుల్ తీవ్రంగా చూస్తూ, చేతిలోని దండం యెడం చేతిలో తాకిస్తూ కనిపించాడు. అతని వెనుక యిద్దరు పోలీసులు, మధ్యగా ఒక స్త్రీ. అది అప్పలమ్మ. దాని వెనక ఒక ఆడమనిషి పోలీస్ దుస్తుల్లో కనబడింది.

యేమీ వూహకందని బైరాగి నిలబడిపోయాడు.

అప్పలమ్మే దూసుకువచ్చింది. బైరాగిని వాటేసుకుని పట్టశక్యం కాకుండా యేడిచింది. హెడ్డు కనికరం లేకుండా దాని జుట్టు పట్టి దుశ్శాసనునిలాగా లాగాడు. అప్పి పమిట పట్టుకున్నది.

బైరాగిలో చైతన్యం కలిగింది. ముఖంలోకి మార్పు వచ్చింది. కనుబొమలు కదిలినై. నిట్టూర్పు వచ్చింది. మాట పెగలక, "యేమిటి సెలవు?" అన్నట్టు దోసిలి పట్టి తలవూపి అడిగాడు.

"నీ యిల్లు సోదా చేయాలి." హెడ్డు వురిమాడు.

బైరాగి చిరునవ్వు చిందించాడు.

"రండి. అడ్డేవారెవరు?" అన్నాడు.

గొళ్ళెం తీసి తలుపు బార్లా తీసి, వినోదం చూస్తున్నట్టు వుండిపోయాడు.

హెడ్డు అప్పివంక చూశాడు.

"యెక్కడ దాచావో చూపితే, పని త్వరగా తెములు తుంది. గాలంచాలంటే చానా లెక్కవుద్ది."

అప్పి గుడ్లగూబలాగా చూసింది. వెనకనించి దాని గూళ్ళ మధ్యగా లాఠీ పొడుపు తగిలింది. దాని ఒడిచెయ్యి వెనక్కు తిప్పబడి మెలి తిరిగింది. అప్పి కెవ్వుమన్నది.

"మరి త్వరగా చెప్పు. నీవంటె నాకు ముద్దనుకున్నావా?" హెడ్డు బుసలుకొట్టాడు.

పది నిమిషాలు గడిచినై. దొంగ సొమ్ము చేజిక్కించుకుని, పోలీసులు విప్పారిన ముఖాలతో బైటికొచ్చారు. అంత టితో పోక, గ్రంథాలయంలో జొరబడి, అదంతా కుళ్ళగించి జల్లెడబట్టి వచ్చారు.

అప్పుడు బైరాగి అప్పిని పరిశీలనగా చూశాడు. చిని గిన రైకా, మాసి రేగిన తలా, వెలిసిన చీరా, కమిలిన చేతులూ, కాల్చబడిన చెక్కిళ్ళూ, చిట్లి నెత్తురు చిమ్మి గడ్డకట్టిన నుదురూ, పగిలిన పెదిమలూ, కళా కాంతీ లేని మొహం, బోయకు చిక్కిన లేడిలాగా కనబడింది.

విచారంగా చూసి, తల పంకించి, నవ్వుముఖం పెట్టాడు. భోరుమంటూ అతని పాదాలమీద బడింది. పాదాలు కన్నీటితో తడిపింది. బైరాగి ద్రవించిపోయాడు. లేవదీసి తల నిమిరాడు. మెల్లిగా అన్నాడు.

"అదా నీ సైజం అప్పీ! డబ్బు వెంట పరుగెత్తావు గదూ? అందుకేనా యీ స్థితి ఓదార్చాడు.

"ఔ" నంటూ తలూపింది. కన్నీళ్ళు తుడుచుకోలేదు. పోలీసులు, "పద. పద. వాలు యాసాలు" అని లాగారు.

హెడ్డు బైరాగిని చూసి హేలగా నవ్వి, మీసం తిప్పాడు.

"చేతనైతే వచ్చి రచ్చించు. చరణు వేడిందిగా. ముండకి చానా విద్దెలొచ్చు. యేటనుకున్నావో మామా! తానే మెరగనని సెప్పేందుకు నీ కాలమీద బడ్డాది." వికటంగా నవ్వాడు.

"కబడ్దార్! మామా! నామాటినుకో. నీ తల యిందులో దూర్చకు. ఈ గడేకారి యిస్సైన్ని కొడుకును గొంతు నులిమి సంపింది. బందిపోటుతో శరీకై యిళ్ళు ముట్టించింది. గలభా గందర గోళంలో సొమ్ము దాటవేసేందుకు సాయపడింది. పంచు కోటంలో తగాదా వచ్చి పట్టుబడింది. మాయదారి డబల్‌క్రాస్ యాసం నాకు తెల్లనుకున్నది. దీని బాగస్వాముల్ని పట్టేసి నాం. ఆరిలో ఒకడికిది లొంగలేదుట. బైట పెట్టేసినాడు. యెన్ని యాసాలు మార్చినా యిట్టే పట్టేస్తిని దీన్ని. నీ యింట దాస్తే యెవరూ అనుమానించరని అర్ధరేత్తిరి పారెత్తి వచ్చి దాచేసింది. నీ తాళం దానికో లెక్కా మామా. కాస్తా కూస్తా గాదు. లక్ష విలువ చేసే వెండి బంగారాలు రొక్కం తీస్తుం డగా, అడ్డమొచ్చిన బిడ్డని పీక నొక్కింది. ఫొటోలున్నాయి మామా! జాగర్త నీక్కూడా పురిబెట్టిస్తదిది. అమ్మో! పోలీస్

స్టేషన్లో యెన్ని తిప్పలు బెట్టింది. ఇరవై మందికి జవాబిచ్చింది సివంగిలాగ. నంపి యేటి బావుకుంటాము. సొమ్ము దొరకాలి గంద, అని పేణాలతో వుంచాము. గుడ్డలూడదీసి, యీడెంట తిప్పినా సిగ్గులేదు." అంటూ దాని స్వభావమూ, తన ప్రతాపమూ వివరించాడు.

మీసం మెలేస్తూ వెన్ను విరుచుకుంటూ కదిలాడు. దొరికిన సొమ్ము పట్టుకుని పోలీసులూ కదిలారు. లాఠీ చంక నుంచుకుని ఆడపోలీసు అప్పిని నడిపించింది.

బైరాగి అప్పివంక చూశాడు. అప్పి తల తిప్పింది. సున్నితంగా తలాడించింది. 'నేను చంపలేదు' అని పెదిమలాడించింది. చేతివేళ్ళూ ఆడించింది. హెడ్డూ పోలీసులూ వెనక్కు తిరిగారు. దాన్ని గుంజారు. అదీ గుంజుకున్నది. అరవటం మొదలెట్టింది. రెండు దెబ్బలు పడినై. ధ్వని హెచ్చింది. పెనగులాటా పెంచింది.

"యేటీ యీసం? యేం చేస్తున్నావూ?

యేం చేస్తున్నదో బైరాగికి అంతుబట్టలేదు. జుట్టు ముడి వీడింది. సంస్కారం లేని బారెడు జుట్టూ పిరుదుల మీద పడింది. పమిట చెదిరిపోయింది. విచిత్ర పెనగులాటలో జర్రున జారి కిందబడింది. దాన్ని లేవదీశారు. ఆడపోలీసు చీర దిద్ది పమిటవేసింది. లాక్కుపోతున్నారు. అప్పి వెనక్కు చూసి చిత్రంగా నవ్వి కళ్ళు నేలవేపు తిప్పింది. తీసికెళ్ళారు.

అప్పి నాటకం సరిగా అర్థంగాక బైరాగి తల చేతులతో పట్టుకుని కూలబడ్డాడు. నవ్వు వచ్చింది గానీ, విచారమూ కలిగింది. తల గుండెమీద ఆనింది. చూపు తన పాదాల దగ్గర పడి వున్న కాగితపు వుండమీద పడింది తీసి విప్పాడు. చిన్న కాగితం. యెక్కువలైన్లులేవు. "నీయింట యింకా వున్నది. చేతనైతే విడిపించు." అంతె చూద్దాము అనుకుంటూ లేచాడు.

ఆరోజంతా లైబ్రరీ సరిజేయడంతో సరిపోయింది. ప్రెస్ విలేఖరులొచ్చారు. ప్రశ్నె వేశారు, చెప్పాడు. ఉన్న యంక్వయిరీ జరిగింది, వారూ వెళ్లారు. టీ తాగి రొట్టె తిని వచ్చాడు. రాత్రయింది. విసుగూ విరామం లేకుండా, యిల్లుసర్దుతూనెతగ్గా పక్కసద్ది బొంత దులవగా డబ్బు కిందపడింది. పైపులో పోసుకునే పొగాకు పొడి పెట్టుకునే సంచీలో వున్నాయి. వందరూపాయలనోట్లు పాతవి. సంచీ బొంత రంగులో ఉన్నది. చినిగిన చోట కూరబడింది.

## 6

ఆనాడాదివారం. బైరాగి కాఫీ తాగి రొట్టెతిని అడ్వొకేటు గారింటికి వెళ్లాడు. ఆఫీసురూములో వున్నారు లాయరుగారు. క్లయింట్లూ వున్నారు. కూచోమని సన్న చేశారాయన. బైరాగి గోడకానుకుని నిలబడ్డాడు.

క్లయింట్సు వెళ్ళాక, "యేవిటి బైరాగీ యిలా వచ్చావు? మునిసిపల్ లైబ్రరియన్వైనావుట. ఇన్ఫ్లెన్సు పెరుగుతున్నదే. గానీ తరగటం లేదుట. యెన్నికలకు నిలబడతావా? సర్పంచ్

వవుతావా? కూచో, నించునె వున్నావెందుకూ? హాస్యమాడారు. 'చిత్తం నమస్కారం పెద్దాశలేదు బాబూ. పెద్దవాడినైనా తమ దర్శనం కోసమే వచ్చాను.'

'యేమిటి కావాలి?'

'కొన్నేళ్ళ క్రితం తమఇంట్లో పనిపిల్లగా వుండేది అప్పి అది హత్యానేరంలో చిక్కుకున్నది బాబుగారూ. దాన్ని విడిపించాలి. అదిమీవల్లే అవుతుంది.'' అంటూ డబ్బున్న కవరు అడ్వొకేట్‌గారి యెదుట బల్లమీదుంచి, చేతులు జోడించాడు.

'ఆ కేసు పేపర్లో పడింది. వివరాలూ విన్నాను. లాభం లేదేమో బైరాగీ. పోలీస్ డిపార్టుమెంటు సాక్ష్యాలుసేకరించారు. ఫొటోలే అందాయట.' డబ్బు వద్దు అన్నట్టు చెయ్యివూపి పంచీ సెట్టారు.

'పోలీసువారినీ కలుసుకున్నాను బాబుగారూ! జైలుకెళ్ళి అప్పితోనూ మాట్లాడి వచ్చాను. అది తాను చంపలేదంటుంది. వేరే పగవుండి కూనీ కేసులో యిరికించారంటుంది. అమ్మగారి దర్శనంగూడ చేసుకున్నాను. శలవిప్పించండి. పన్నెండయింది. మీకు భోజనం వేళ.'' యిడమీయకుండా వెళ్ళిపోయాడు.

## 7

కేసు వాయిదాపడినా, శాన్నాళ్ళుగడిచినా అప్పి గెలిచింది విడుదల చేశారు. దాని తత్వం తెలిసినవాళ్లు అశ్చర్యపోయారు. అప్పి అపూర్వవరుగా అయి, కొద్దిమంది పేర్లు చెప్పింది, దొంగ

సొమ్ము యెవరెక్కడమ్మగలరో బైటపెట్టింది. వెండి స్మగుల్ చేసేవారి స్థావరాలు చెప్పింది, పోలీసువారి శరణు జొచ్చింది. యస్సైన్ గారబ్బాయి చావలేదట. ఆ అబ్బాయికి గుండె జబ్బున్నదట. వాళ్ళ ఫామిలీ డాక్టరు బోనెక్కి సాక్ష్యమిచ్చాడు. ఆ అబ్బాయి అప్పని పట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా పోటు వచ్చిందిట. అప్ప అతని గొంతు పిసక లేదుట. పడిపోతున్న అబ్బాయిని భద్రంగాబెడ్‌మీదుంచిదిట. అతను చూపిన మందు యిచ్చిందిట. అప్ప చెప్పగానే ఆ అబ్బాయిని హాస్పటల్‌కి తీసి కెళ్ళి ఆక్సిజన్ టెంటులో వుంచారుట. ఆ అబ్బాయికి ఫొటోలు తీయడం హాబీ. మెడలోనో జేబులోనో కెమెరా వుండాల్సిందే. ప్రెస్ విలేఖరులడిగితె కొన్ని ప్రింట్లు యిచ్చాడు. కాంపిటీషన్‌కి పంపాలని కొన్ని స్నాప్స్ దాచుకున్నాడట. అప్ప నిర్దోషి అని సాక్ష్యమిచ్చిందా అబ్బాయేట. ప్రాసిక్యూషన్ అంతా గాలికె గిరిపోయింది.

## 8

గ్రంథాలయం మూసి, బైరాగి రాత్రి యెనిమిదన్నరకి యింటి కెళ్ళాడు. వండుకు తిన్నాడు. వీధిలో మంచం వాల్చుకుని, దానిమీద వాలాడు. మిత్రులు వచ్చారు. కతలు చెప్పుకున్నారు కబుర్లాడుకున్నారు. బైరాగి పదాలు పాడాడు.

నక్క యొక్కటి యుండెరా కుక్కలను యెగదోలెరా
చిక్కులేకను చిన్న మకరిని నిక్కవమ్ముగ మింగెరా
విర్రవీగుచు కేక వేయును ఈగ మంచము మింగెరా

నవ్వుతూ మిత్రులు వెళ్ళిపోయారు ఇంటికి తాళం వేసాడు కళ్ళు మూతలు పడతున్నాయి.

మబ్బులచాటు నుంచి చంద్రుడు దోబూచులాడుతున్నాడు చెట్టు చాటునుంచి అప్పి పిల్లిలాగా వచ్చింది. అప్పి మంచం పక్కనే కూచున్నది, చప్పుడు విని కళ్ళు విప్పాడు బైరాగి.

'యెవరు?నువ్వా? యేమి యింతరాత్రిల వచ్చావు, నిన్ని డిపించే తలికి నా తాతలు దిగొచ్చారు అంతా ఖర్చయినాది' యెమీ మిగల్లేదు"

డబ్బు కోసం రాలేదుమామా! ఆగిపోయి నేలమీద గీతలు గీయసాగింది అప్పి,

మరెందుకొచ్చావూ అంట? అంతలోనే విటకారంగ నవ్వే డు పెళ్లాడవాం! రా అని పిలవటానికొస్తి వా? అడుగో తాత వస్తున్నాడు న్యాయమడుగుదాముండు యెంతైనా అనుభ మున్నవాడు లేచి కూచున్నాడు బైరాగి,

రా! తాతా రా! నీ కోసమే చూస్తున్నాం సమయానికొ చ్చావు చుట్ట యిచ్చేదా ఇలా మంచంమీద కూచో చుట్టా అగ్గి పెట్టీ అందించాడు

తాత చుట్ట ముట్టించి కిందే కూచున్నాడు.

"యేటి కత వుద్దేగం యిప్పిస్తనంటివా?"

"లేదు లేదు తాతా!" బైరాగికి హుషారొచ్చింది. చేతులు తిప్పుతూ నవ్వుతూ అన్నాడు.

"దీన్ని పెళ్ళాడి బతికున్నన్నాళ్లూ కాపాడుతా వుండా లంట. తనెమో డబ్బంట పరిగెత్తుదాదంట.

అప్పి చిరుకోపం చూపిస్తూ రాయి విసిరేస్తూ అన్నది. "సెనట్టనలేదు తాతా! చెప్పేది వినిపించుకోడు మామ."

"ఆడితో నీ కెందుకే ఆడు బైరాగి. తోడేళ్లతో, పులులతో నెస్తం కట్టేదానికీ, బైరాగి మాటలు చెవికెక్కుతాయా? పో,పో. నిద్దరేల వొక్కతివే యెందుకొచ్చావూ." గుప్పు గుప్పున పొగ వదిలాడు.

అప్పలమ్మ విధిలేనట్టు లేచి, వెనక్కు చూస్తు కాళ్ళీడ్చు కుంటూ వెళ్ళిపోయింది.

[] ○ []